ప్రజాశక్తి
సోమవారం 14 అక్టోబర్ 2024
5
అనంతపురం

15న 'కొన్ని చీకట్లూ... ఓ వెలుతురూ...' కథాసంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం.ప్రగతి రచించిన కథాసంపుటి 'కొన్ని చీకట్లూ... ఓ వెలుతురూ...' ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 15న కళాశాలలో నిర్వహిస్తున్నట్లు సాహితీస్రవంతి సత్యసాయి జిల్లా కన్వీనర్ హరి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాహితీస్రవంతి, మహిళా కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ ఎంఎం. వినోదిని పాల్గొని పుస్తకావిష్కరణ చేస్తారని చెప్పారు. సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లి షరీఫ్ పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు అధ్యక్షతన జరిగే ఈ ఆవిష్కరణ సభలో పుస్తక ప్రచురణకర్త, ఛాయ బాధ్యులు అరుణాంక్ లత, ప్రముఖ మాండలిక రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి, అభ్యుదయ రచయితల సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షులు సిద్దగిరి శ్రీనివాస్, వర్ధమాన రచయిత్రి చిలుకూరి దీవెన తదితరులు పాల్గొంటారని చెప్పారు. రచయితలు, సాహిత్యాభిమానులు ఈ ఆవిష్కరణ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కళాశాల ప్రిన్సిపల్, పుస్తక రచయిత ప్రగతి, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి కోరారు.

మానవ మృగాలు

మానవత్వం మంటగలిసింది. పొట్టకూటి కోసం పరాయి రాష్ట్రం నుంచి వలస వచ్చిన కుటుంబంపై కామాంధులు కాటేశారు. సభ్య సమాజం తలదించుకునేలా దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కుటుంబంలోని తండ్రీకొడుకును తాళ్లతో కట్టేసి, కుటుంబం తలదాచుకుంటున్న రేకుల షెడ్‌లోకి చొరబడిన ఆగంతకులు అత్తా కోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘాతుకానికి పాల్పడింది గంజాయి బ్యాచ్ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దసరా పండుగ రోజు సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి సమీపంలో నిర్మాణ దశలో ఉన్న పేపర్‌మిల్ వద్ద జరిగిన ఘటనపై చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

- చిలమత్తూరులో గ్యాంగ్ రేప్
- వలస కుటుంబానికి చెందిన అత్త, కోడలిపై అత్యాచారం
- నిందితులు గంజాయి బ్యాచ్‌గా అనుమానం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ రత్న
- పోలీసుల అదుపులో నిందితులు ?

పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న చిలమత్తూరు సిపిఎం నాయకులు

పోలీసులకు అందజేసే వినతిపత్రం చూపుతున్న హిందూపురం సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండల పరిధిలోని టేకులోడు గ్రామపంచాయతీ నల్లబొమ్మనపల్లి వద్ద నిర్మాణ దశలో ఉన్న పేపర్ మిల్లు వద్ద మానవ మృగాలు అత్తాకోడళ్లపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డాయి. శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జరిగిన ఈఘటనకు సంబందించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... చిలమత్తూరు మండల పరిధిలోని టేకులోడు గ్రామపంచాయతీ నల్లబొమ్మనపల్లి వద్ద నిర్మాణ దశలో ఉన్న పేపర్ మిల్లులో బళ్లారికి చెందిన ఓ కుటుంబం(నలుగురు) పొట్టకూటికోసం వచ్చి అక్కడే ఉంటూ పని చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అటుగా నలుగురు గుర్తు తెలియని ఆకతాయిలు రెండు ద్విచక్రవాహనాల్లో వచ్చారు. ఎవరూ ఏంటని ఆ కుటుంబ పెద్ద టార్చ్‌లైట్ వేసి అడిగాడు. దీంతో వారు ఆ కుటుంబపెద్దను కొట్టారు. వారిని అడ్డుకోబోయిన ఆయన కుమారుడిని కొట్టి ఇరువురిని తాళ్లతో కట్టేశారు. వారు నివాసముంటున్న రేకులషెడ్‌లోకి అదే కుటుంబానికి చెందిన అత్త, కోడలిపై ఆ నలుగురు గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. అనంతరం బాధితులు గ్రామస్తుల సాయంతో చిలమత్తూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ : గ్యాంగ్‌రేప్ ఘటన తెలిసిన వెంటనే ఎస్పీ రత్న శనివారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ దుండగులని త్వరలోనే పట్టుకొంటామన్నారు. పరిశ్రమ వద్ద ఉన్న సిసి కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తిస్తున్నామన్నారు. గ్యాంగ్‌రేప్ విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ స్థానిక నాయకులతో ఫోన్లో మాట్లాడారు. అనంతరం ఎస్పీతో ఫోన్లో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీ కోరారు. అదేవిధంగా మంత్రి సవిత కూడా ఫోన్లో ఎస్పీతో మాట్లాడారు. నిందితులపై చర్యలు తీసుకోవాని కోరారు.

పోలీసుల అదుపులో నిందితులు..?

చిలమత్తూరు మండలం నల్లబొమ్మలపల్లి లో శనివారం తెల్లవారుజామున అత్తా, కోడలుపై జరిగిన గ్యాంగ్‌రేప్ కేసు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనలో సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నలుగురు హిందూపురానికి చెందిన గంజాయి బ్యాచ్‌గా తెలుస్తోంది. వీరు ఇంతకు ముందు పలు కేసుల్లో అరెస్టు అయినట్లు సమాచారం. వీరిలో ముగ్గురు యువకులు మైనర్లని తెలుస్తోంది. మరిన్ని వివరాలు పోలీసుల ప్రెస్‌మీట్‌లో తెలియాల్సుంది.

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

వలస కార్మికులకు న్యాయం చేయాలి : సిపిఎం

జీవనోపాధి కోసం వలస వచ్చిన తండ్రి కొడుకులని కట్టేసి అత్తా కోడలను అత్యాచారం చేసిన ఉన్మాదులని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక పోలీసుస్టేషన్‌లో అందజేశారు. పోలీస్ స్టేషన్ లో వినతీ పత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిర్మాణ దశలో ఉన్న పరిశ్రమ వద్ద ట్రైనింగ్ తీసుకున్న సెక్యూరిటీ గార్డులను యాజమాన్యం ఏర్పాటు చేయని కారణంగా పొట్ట కూటికోసం వచ్చిన వలస కూలీలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. యాజమాన్యం నిర్లక్ష్యం కూడ ఇందులో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వీరిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నాయకులు ప్రవీణ్ కుమార్, వెంకటేష్, రామచంద్ర, నరసింహ తదితరులు కోరారు.

భయాందోళనలో ప్రజలు : వలస కుటుంబానికి చెందిన మహిళలపై గ్యాంగ్‌రేప్ ఘటనతో మండల వాసులు భయాందోళనకు గురవుతున్నారు. పండుగ వేళ జరిగిన ఈ ఘటనతో పక్కనే ఉన్న నల్లబొమ్మనపల్లి, కంబాలపల్లి, ఆరుమాకులపల్లి, టేకులోడు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తమ పొలాల వద్దకు పనులకు వెళ్లడానికి భయపడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం

హిందూపురం : అత్త, కోడలిపై గ్యాంగ్ రేప్ కు పాల్పడిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఎస్‌పికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారు ఎంతటి వారైన ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వలస కార్మిక చట్టాన్ని అమలు చేసి, వలస కార్మికుల వివరాలను సేకరించాలన్నారు. వలస కార్మికులతో పరిశ్రమల నిర్వహకులు వెట్టి చాకిరి చేయించుకుంటు, వారికి కనీస సౌకర్యాలను సైతం కల్పించడం లేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్థాయిలో ప్రత్యేక కమిటీ వేసి, వలస కార్మికుల సమస్యలపై విచారణ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమణ, గోపాల్, ఆదిలక్ష్మి, షాహేదా, నాజీయా, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చిలమత్తూరు మండలంలో వలస కార్మిక కుటుంబానికి చెందిన అత్తా కోడలిపై సామూహిక అత్యాచారం చేసిన నిందితులను వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలి. బళ్లారి నుండి ఉపాధి కోసం వచ్చిన కుటుంబానికి చెందిన మగవారిని కత్తులతో బెదిరించి కట్టిపడేసి అత్త కోడలిపై సామూహిక అత్యాచారం చేయడం దారుణం.దుండగులను వెంటనే అరెస్టు చేయాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి. చిలమత్తూరు సంఘటన వలస కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తోంది.

వి. రాంభూపాల్
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

బాధితులకు న్యాయం చేయాలి

చిలమత్తూరు మండలంలో అత్తా కోడలిపై సామూహిక అత్యాచారం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన మహిళలపై ఎంతటి అకృత్యాలు జరుగుతున్నాయో ఈ సంఘటన సాక్ష్యం. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి

వి. సావిత్రి
ఐద్వా రాష్ట్ర కోశాధికారి

దోషులను కఠినంగా శిక్షించాలి

వలస కార్మిక కుటుంబానికి చెందిన మహిళలపై సామూహిక అత్యాచార ఘటనకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలి. అ అత్యాచార ఘటనకు పాల్పడింది గంజాయి ముఠాకు చెందిన వారనిసోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై పోలీసులు లోతుగా విచారణ జరిపాలి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలి. అలాగే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి.

గౌతమి,
ఐద్వా సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి

నిందితులను కఠినంగా శిక్షిస్తాం : మంత్రి

ప్రజాశక్తి-హిందూపురం

చిలమత్తూరు మండలం నల్ల బొమ్మనపల్లి సమీపంలో ఉపాధి కోసం వచ్చిన అత్త, కోడలిపై గ్యాంగ్ రేప్ కు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని మంత్రి సవితమ్మ అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి సవితమ్మ, ఎంపి పార్థ సారథి ఆదివారం పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం మంత్రి మాట్లాడుతు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హోం మంత్రి అనితతో పాటు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకున్నారన్నారు. అమాయక మహిళలపై అతి దారుణమైన చర్య జరిగిందన్నారు. గత ప్రభుత్వం వైఫల్యాల కారణంగానే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. గత ఐదేళ్లలో గంజాయిని ప్రోత్సహించింది ఎవరో అందరికీ తెలుసునని అన్నారు. గంజాయి వల్ల యువత పెడదారి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం గంజాయి పై ఉక్కు పాదం మోపుతోందని మంత్రి చెప్పారు. అదేవిధంగా ఘటన జరిగి 24 గంటలు గడవకనే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారని మొత్తం ఆరుగురు నిందితులు ఘటనలో ఉన్నారని వారంతా గంజాయికి అలవాటు పడినవారేనని వారు అనేక కేసుల్లో నిందితులుగా ఉండి, జైళ్లకు కూడా వెళ్ళొచ్చారని పోలీసుల విచారణలో తెలుస్తున్నాయని మంత్రి అన్నారు. ఘటనలో పాల్పడిన నిందితులు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తమ రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్న వైసీపీ వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఎంపి పార్థ సారథి మాట్లాడుతు నిందితులను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, రాష్ట్ర కార్యదర్శి రామాంజినమ్మ, హిందూపురం పట్టణ అధ్యక్షులు డిఇ. రమేష్ కుమార్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

హెచ్చెల్సీ 28వ డిస్ట్రిబ్యూటరీ వద్ద ఉద్రిక్తత

రైతులతో చర్చించిన సిఐ

మండల పరిధిలోని కురగానపల్లి, నడిమిదొడ్డి, వెంకటాంపల్లి గ్రామాలకు చెందిన రైతులతో సిఐ కౌలుట్లయ్య ఆదివారం చర్చించారు. నీటి పారుదల విషయంలో గొడవలకు దిగొద్దన్నారు. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క రైతుకూ నీరు అవసరమే అని.. నీటి విషయంలో సర్దుబాటు చేసుకుని నీటి పారుదల చేసుకోవాలని సూచించారు. క్షణికావేశంలో గొడవలు పడి ఇబ్బందుల పడితే జైలుకు వెళ్తారన్నారు. అప్పుడు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నాగారాజు సిబ్బంది చలపతి, రాము, ఫరూక్, జగదీష్ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న సిఐ

నీటి కోసం నడిమిదొడ్డి, వెంకటాంపల్లి రైతుల ఆందోళన
అడ్డుకున్న కురుగానిపల్లి రైతులు
ఉద్రిక్తత..పోలీసుల ప్రవేశంతో ప్రశాంతం

ప్రజాశక్తి - నార్పల

హెచ్ఎల్‌సి నుంచి వచ్చే నీటిని వదులుకునే విషయంలో మూడు గ్రామాలకు చెందిన రైతులు శనివారం రాత్రి వాగ్వాదానికి దిగారు. నీటిని తాము ముందు వదులుకుంటామంటే తాము ముందు వదులుకుంటామని రైతులు పట్టుపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తతతకు దారి తీసింది. ఈఘటనకు సంబందించిన వివరాలు... హెచ్ఎల్‌సికి నీటిని విడుదల చేయడంతో రైతుల సౌకర్యార్థం నార్పల హెచ్ఎల్సీకి ఉన్న డిస్ట్రిబ్యూటరీలకు అధికారులు నీరు వదిలారు. ఈ నీటిని తమ గ్రామానికి వదలుకునే విషయంలో మండలంలోని కురగనపల్లి, నడిమిదొడ్డి, వెంకటాంపల్లి గ్రామ రైతులు 28వ కాలువ వద్ద శనివారం రాత్రి వాగ్వాదానికి దిగారు. తమ పంటలు ఎండిపోతున్నాయని, తమ పొలాలకు నీరు పెట్టుకొని నీటిని వదులుతామని కురగనపల్లి వాసులు చెబుతుండగా, తమకు తాగడానికి కూడా నీరు లేవని నీరు చివరికి పంపాలని వెంకటంపల్లి వాసులు వాదనకు దిగారు. తమ పంటలు ఎండిపోతున్నాయని తమ గ్రామంమీదుగా వెళుతున్న నీటిని వాడుకోనివ్వరా అని కురగనపల్లి రైతులు వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సమాచారం అందుకున్న సిఐ కౌలుట్లయ్య ఆదేశాలతో ఎఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ దేవకుమార్, కానిస్టేబుళ్లు అమర్, రాము, నారాయణస్వామి, రాఘవేంద్ర ఘటనాస్థలానికి చేరుకున్నారు. రైతులకు సర్దిచెప్పి పంపారు. ప్రస్తుతానికైతే సమస్య సద్దు మనిగిందని నీటి విషయంలో ఆయా గ్రామాల్లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉందని ఆయా గ్రామాల ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ప్రజాప్రతినిధులు, హెచ్ఎల్‌సి అధికారులు కల్పించుకొని సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఆందోళనకు దిగిన రైతులు

నేడే 'లిక్కర్' లాటరీ

ఏర్పాట్లు చేసిన ఎక్సైజ్ శాఖ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మద్యం దుకాణాల లాటరీ సోమవారం జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు మద్యం దుకాణాల నిర్వహణను ప్రయివేటుకు అప్పగించింది. ఈ మేరకు ఈ నెల రెండవ తేదీ నుంచి మద్యం దుకాణల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. అనంతపురం జిల్లా పరిధిలో 136 దుకాణాలు, సత్యసాయి జిల్లా పరిధిలో 87 దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించారు. అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలకు 3261 దరఖాస్తులు అందాయి. సగటున ప్రతి దుకాణానికి 23.98 దరఖాస్తులు అందాయి. గరిష్టంగా ఒక దుకాణానికి 51 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా రెండు దరఖాస్తులు వచ్చిన దుకాణాలు ఉన్నాయి. సత్యసాయి జిల్లా 87 దుకాణాలకు 1518 దరఖాస్తులొచ్చాయి. సగటున 17.45 దరఖాస్తులు అందాయి. ఇక్కడ గరిష్టంగా ఒక దుకాణానికి 46 దరఖాస్తులందగా, అత్యల్పంగా ఐదు అందినవీ ఉన్నాయి. వీటికి సంబందించి సోమవారం లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించనున్నారు. ఈ లాటరీ తీసే ప్రక్రియను అనంతపురం నగరంలోని జెఎన్‌టియు ఆడిటోరియంలో ఏర్పాట్లను చేశారు. దుకాణాల వారీగా లాటరీ తీసే ప్రక్రియ కొనసాగనుంది. అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు లాటరీ కోసం దరఖాస్తు చేసిన వారు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. లాటరీ తగిలితే లక్కు తగిలినట్టేటని ఆశపడుతున్నారు రెండేళ్ల కాల వ్యవధి కోసం ఈ దుకాణాలివ్వనున్నారు.

ఈనెల 16న దుకాణాలు ప్రారంభం : ఈనెల 16వ తేదీ నుంచి కొత్త దుకాణాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు స్టాకును ఇప్పటికే నిలువ చేసినట్టు కనిపిస్తోంది. అనంతపురం జిల్లాలో 1.20 లక్షల కేసులు స్టాకు గోడౌన్‌లో నిలువనున్నట్టు తెలుస్తోంది. ఇందులో 90 వేలు ఐఎంఎల్ ఉండగా 20 వేల కేసులు బీర్లు ఉన్నాయి. వీటిని కొత్తగా టెండరు దక్కిన వారికి కేటాయిస్తారు. అయితే ఒక్క రోజు వ్యవధిలో కొత్త షాపు ఏర్పాట్లు పూర్తవుతుందా లేదా అన్నది సందేహాస్పదంగా ఉంది. లాటరీ వేసిన వారు కూడా ఇది అంత త్వరగా సాధ్యమవదని అంటుండటం గమనార్హం.

వికలాంగుల అభ్యున్నతికి చేయూత

వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి ఎస్.అబ్దుల్ రసూల్



ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడిన వారికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలా చేయూతను అందిస్తున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఎస్. అబ్దుల్ కూర్ పేర్కొన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వారిని గుర్తించి వారికి ప్రభుత్వ పరంగా ప్రోత్సాహాన్ని అందించేలా తమ శాఖ కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాన కల్పించి వాటి బట్టి అర్హులకు లబ్ది చేకూరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో తమ శాఖ ద్వారా అమలు జరుగుతున్న సంక్షేమాన్ని గురించి వివరించారు.

ప్రశ్న :ఉమ్మడి జిల్లాలో ప్రోత్సాహాల గురించి వివరించండి.?

జవాబు : ప్రస్తుతం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న వికలాంగుల అభివృద్ధి కోసం అనంతపురంలో జిల్లా కార్యాలయం ఏర్పాటు చేశాం. అక్కడి నుండే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నాం. ఇటీవల ఉమ్మడి జిల్లాల్లో వికలాంగుల కోసం మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశాం. డిగ్రీ, పీజీ విద్యార్థులకు ట్యాబులు, ట్రైసైకిళ్లను పంపిణీ చేశాం.

ప్ర : వికలాంగ విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు ఏమిటి.?

జ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిగ్రీ, డిప్లొమా అంతకంటే ఎక్కువ తరగతులు చదువుతున్న 40 శాతం అంతకంటే ఎక్కువ అంగవైకల్యం కలిగి ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్నారు. అయితే వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించకూడదు. వీటిని పొందేందుకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

ప్ర: వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారా.?

జ : ఏపీ ప్రభుత్వం 2002 నుంచి వికలాంగుల కోసం ప్రత్యేక రిక్రూట్‌మెంట్‌ను ఏర్పాటు చేసింది. 2020 సంవత్సరంలో నాలుగు శాతం రిజర్వేషన్లు పెంచింది. 1:1 నిష్పత్తి ప్రకారం దృష్టిలోపం, వినికిడి లోపం, వైకల్యం, మేధావైకల్యం, నిర్దిష్ట అభ్యాసన వైకల్యం, మానసిక ఆనారోగ్యం, బహుళ వైకల్యం ఉన్నవారికి బ్యాక్ లాగ్ పోస్టులు ఇవ్వనున్నాం. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు నోటిఫికేషన్ జారీ చేస్తాం.

ప్ర: అంధుల కోసం చేస్తున్న కార్యక్రమాలు ఏమిటి.?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంధుల కోసం రెండు హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో 150 మంది ఆంధులకు పునరావవాసం కల్పించాం. వారిలో వందమంది బాలురు, 50 మంది బాలికలు ఉన్నారు. వయోవద్ధులకూ కొన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ప్రశ్న: వికలాంగులకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇస్తున్నారు..?

జ : వికలాంగులు, వయోవృద్ధులకు ప్రభుత్వం ఎన్నో పథకాల ద్వారా చేయూతను ఇస్తోంది. వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయాన్ని బట్టి జాతీయ ఉపకార వేతనాలు, ట్రై సైకిళ్ళ, చక్రాల కుర్చీలు, త్రీ వీలర్లు, వినికిడి పరికరాలు ,వాకింగ్ స్టిక్, ప్లేటు వంటి వివిధ సహాయ ఉపకరణాలను అందిస్తున్నాం. డిప్లొమా, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న వారికి ట్యాబులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నాం.

ప్రజాశక్తి
www.prajasakti.com

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు-కలేకుర్తి బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-కణేకల్లు

మండలంలోని వేదవతి-హగిరిపై రూ.48 కోట్లతో నిర్మించనున్న కణేకల్లు-కలేకుర్తి బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు భూమిపూజ చేశారు. అనంతరం ఇందుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణంతో కణేకల్ మండల ప్రజల ఎన్నో సంవత్సరాల కల నెరవేరనున్నారు. ఎమ్మెల్యేగా తన కృషి ఎంత ఉన్నప్పటికి సిఎం చంద్రబాబు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రోడ్డు భవనాల శాఖ మంత్రి జనార్ధన్‌రెడ్డి సహకారంతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. అలాగే అతిత్వరలో కణేకల్‌లో డిగ్రీ కళాశాల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం కణేకల్, ఉరవకొండ, రాయదుర్గం ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున సాధ్యమైనంత త్వరగా బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పద్మావతి, ఎంపిపి లీలావతి, మండల కన్వీనర్ లాలెప్ప, సుదర్శన్, మరిరెప్ప, ఆనందరాజ్, షేక్ గౌస్‌పీర్, బసవరాజ్, నవీన్, రమేష్, చాంద్, మారుతి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ ఓబుళరెడ్డి, ఇఇ ప్రసాద్‌రెడ్డి, ఇఇ రవిశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సాయినగర్ 2వ క్రాస్‌లో ఉన్న ఏ1 ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ సౌజన్యంతో అండర్-13 జిల్లా ఓపెన్, బాలికల చెస్ ఛాంపియన్‌షిప్-2024 ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో అండర్-13 ఓపెన్ విభాగంలో శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ ప్రథమ స్థానం జొన్నలగడ్డ నిఖిత్‌చౌదరి ద్వితీయ స్థానం, ఎ.దర్శన్ తృతీయ స్థానం సాధించారు. అలాగే అండర్-13 బాలికల విభాగంలో వై.లాలిత్య ఛాంపియన్‌గా నిలిచింది. ద్వితీయ స్థానంలో త్రిషద, తృతీయ స్థానం కాశీ నౌమిక నిలిచింది. రెండు విభాగాల్లోనూ టాప్-2 విజేతలు నవంబర్ 1-3 తేదీల్లో తాడేపల్లిగూడెంలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్-13 ఓపెన్, బాలికల చెస్ ఛాంపియన్‌షిప్-2024 ఎంపిక పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. విజేతలకు నేషనల్ ఆర్బిటర్ కాశీ రవీంద్ర, టోర్నమెంట్ కోఆర్డినేటర్ గోవిందరాజులు మెడల్స్ అందించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ గౌరవ ఛైర్మన్ బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి ఇంటూరి కిషోర్, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు అభినందించారు.

జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

విశ్వవిద్యాలయంలో మద్యం టెండర్ల లాటరీ తగదు

వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్‌యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలోనే ఎంతో ఉన్నతమైన పేరుప్రఖ్యాతలుగాంచిన జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో మద్యం టెండర్ల లాటరీ కార్యక్రమం నిర్వహించడం బాధాకరమని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యువతను పక్కదోవ పట్టించేందుకు పూనుకుంటున్నారు. ఇందులో భాగంగానే డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, మందు, హత్యా రాజకీయాల్లో రాష్ట్ర ప్రభుత్వం ముందంజలో వెళ్తోందన్నారు. ముఖ్యంగా మద్యం టెండర్ల ఎక్కడ ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సింది.. రాబోవు తరాలకు విద్యాబుద్దులు అందించే విశ్వవిద్యాలయంలో నిర్వహించడం సిగ్గుచేటు అన్నారు. విశ్వవిద్యాలయాలు నిరంతర పరిశోధన కేంద్రాలకు మూలాలు అన్నారు. అలాంటి విశ్వవిద్యాలయ స్థలాల్లో ఇలా మద్యం టెండర్లను నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఏం సంకేతం ఇస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తీరును మార్చుకోవాలని సూచించారు. అలాగే రాబోవు రోజుల్లో విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో మద్యం షాపులు అనుమతించే ఆలోచన ఉన్నా విరమించుకోవాలని హెచ్చరించారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎఒ సరిత

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

త్వరలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పంటలు సాగు చేసిన రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సరిత ఒక ప్రకటనలో సూచించారు. ఈనెల 16వతేదీ వరకు భారీ వర్ష సూచన ఉంటుందని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రస్తుత పంటలను కాపాడుకోవాలన్నారు. వరి పొలాల్లో నీరు నిలబడకుండా బయటికి పంపాలన్నారు. వీలైనంత వరకు పైపాటి ఎరువులు వేసుకోకూడదన్నారు. వేరుశనగ పంట కోతలు పూర్తి అయి ఉంటే కాయలు తడవకుండా టార్పాలిన్స్‌తో కప్పి ఉంచుకోవాన్నారు. ఒకవేళ కోతకు సిద్ధంగా ఉంటే వర్షం తగ్గిన తర్వాత కోతలు చేసుకోవాలన్నారు. పత్తితీతలు చివరి దశలో ఉన్న నేపథ్యంలో చివరి తీతను వాయిదా వేసుకోవాలన్నారు. లేదా త్వరగా చివరిదశ పూర్తి చేసుకుని పత్తి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంది ప్రస్తుతం మొగ్గ నుండి పూత దశలో ఉంది కాబట్టి, వర్షాలు ఎక్కువైతే ఎక్కువైన పొలాల్లో నీరు నిలబడితే, పొలం గట్లను తెంచి నీటిని బయటికి పంపాలన్నారు. లేకపోతే వేరుకుళ్ళ ..ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంటుందన్నారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే ఆయా పంచాయతీలోని రైతుభరోసా కేంద్రంలోని రైతు సిబ్బంది, మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

'అనంత ప్రీమియర్'లో తాడిపత్రి జట్టు విజయం

ప్రజాశక్తి-తాడిపత్రి

అనంత ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్ అండర్-15 క్రికెట్ పోటీల్లో తాడిపత్రి జట్టు విజయం సాధించింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం తాడిపత్రి, ఆత్మకూరు జట్లు తలపడ్డాయి. సీనియర్ క్రికెటర్ చక్రధారి టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. మొదట టాస్ గెలిచిన ఆత్మకూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 26.1 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌటైంది. తాడిపత్రి జట్టులోని ఆదిత్య 5 వికెట్లు, జిలాన్ 3 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తాడిపత్రి జట్టు 122 పరుగులు సాధించి విజయం సాధించారు. తాడిపత్రి జట్టులోని బురానుద్దీన్ 29 పరుగులు, లిఖిత్‌కుమార్‌రెడ్డి 23 పరుగులు, అభిరామ్ 22 పరుగులు చేసి జట్టుకు విజయానికి అందించారు. గెలుపొందిన తాడిపత్రి జట్టుకు ఎటిఎల్ లలిత, సీనియర్ కోచ్ సాదిక్‌వలి, సీనియర్ క్రీడాకారులు, ఆత్మకూరు కోచ్ రఫీ, తాడిపత్రి ఆర్‌డిటి క్రికెట్ కోచ్ భార్గవ్ అభినందనలు తెలిపారు.

ఐదు వికెట్లు సాధించిన తాడిపత్రి జట్టు క్రీడాకారుడు ఆదిత్య

మురుగు కాలువలో ఇరుక్కున్న లారీ

రాయదుర్గం : పట్టణంలోని కోట ముఖద్వారం ఊరి వాకిలి వద్ద శనివారం ఉదయం తెల్లబండలతో వెళ్తున్న లారీ మురికి కాలువలో ఇరుక్కుంది. కోటలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం వద్ద ఆలయ నిర్మాణానికి అవసరమైన రాత్రి స్తంభాలు లారీలో తీసుకుని వస్తుండగా ఊరువాకిలి వద్ద రోడ్డు మలుపులో లారీచక్రాలు మురికి కాలువలో ఇరుక్కుపోయాయి. అనంతరం జెసిబి సాయంతో లారీని వెలికితీశారు. ఊరువాకిలిని ఆనుకుని.. రోడ్డు మలుపు వద్ద మురికి కాలువ ఉండటంతో వాహనాలు తరచూ కోటలోకి వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నాయి.

కాలువలో ఇరుక్కుపోయిన లారీ వెనుక చక్రాలు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

అల్పపీడన ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి పంటలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనమేరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం కోత దశలో ఉన్న వేరుశనగ పంటకోతను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఒకవేళ ఇప్పటికే పంట కోత జరిగి ఉంటే వర్షానికి తడవకుండా టార్పాలిన్ పట్టతో ఎత్తయిన ప్రదేశంలో కప్పి ఉంచాలన్నారు. పచ్చి కట్టే నూర్పిడి చేసే యంత్రాల ద్వారా పంట నుర్పిడి చేసుకోవాలన్నారు. అలాగే పత్తి పంట కోత దశలో ఉన్నందున తడవకుండా పత్తిని తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఇతర పంటలు శాకీయ దశ నుంచి పూతదశలో ఉన్నందువలన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలాల్లో డ్రెయినేజీ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని అదనపు నీటిని నిల్వ చేసుకుంటే నీటి ఎద్దడికి సహాయ పడుతుందన్నారు. అలాగే నీటిపారుదల కాలువలు, చెరువుల కట్టడాలను మరమ్మతులు చేయించుకుని లోతట్టు ప్రాంతంలో ఉండే పొలాలు మునిగిపోకుండా చేసుకోవాలన్నారు. భారీ వర్షపాతం, తుఫాన్లను అంచనా వేసిన వెంటనే 80శాతం పక్వానికి వచ్చిన పంటలను వెంటనే కోసుకోవాలన్నారు. అలాగే పండించిన ఉత్పత్తులను సురక్షితమైన స్థలంలో ఉంచుకోవాలన్నారు. నేల నిర్వహణ కోసం రైతులు నేలను కప్పి ఉంచే పంటలు సాగు చేయడం వల్ల నేల నిర్మాణాన్ని మెరుగు పరుచుకోవచ్చన్నారు. వరద పీడిత ప్రాంతాల్లో నీట మునిగిన పంటలను తట్టుకునే రకాలను అనుసరించాలన్నారు. నీరు నిలబడి ఉన్న పంట పొలాల నుంచి అదనపు నీటిని తీసి వేసి చెరుకు, మొక్కజొన్న, అరటి మొక్కలు, కూరగాయలు, పండ్ల మొక్కలకు యాంత్రిక మద్దతు చేయడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు. వరిపంటలో పాక్షికంగా ప్రభావితమైన పొలాల్లో అదనపు నీటిని పొలం నుంచి తీసివేసుకోవాలన్నారు. పొలాల్లో పంటల విత్తనాలు వరదల వల్ల కొట్టుకొపోతే విత్తనాలకు ప్రత్యామ్నాయంగా వేరే పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. నష్టపోయిన పంటలను వేగంగా కోలుకోవడానికి, నష్టాన్ని తగ్గించడానికి పైపాటుగా ఎరువులు, నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేసుకోవాలన్నారు. ఇకపోతే వర్షం సమయంలో పండించిన ఉత్పత్తులను బహిరంగ మైదానంలో ఉంచవద్దన్నారు. వర్షం కురిసినప్పుడు పురుగు మందులు, ఎరువులను పిచికారీ చేయకూడదన్నారు. వర్షపు నీటిని ఎక్కువసేపు పొలాల్లో ఉంచుకోకుండా బయటకు పంపే మార్గాలను చేసుకోవాలన్నారు. తద్వారా పంట కుళ్లిపోకుండా ఉంటుందన్నారు.

రెండు పుస్తకాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో డా.అంకే శ్రీనివాస్ అధ్యక్షత వహించిన కవిసమ్మేళనం సహిత్యవేదిక ఫేస్‌బుక్ గ్రూప్‌లో జి.వెంకటకృష్ణ, పి.శ్రీనివాస్‌గౌడ్ రాసిన సాహిత్య పరామర్శ వ్యాసాలను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, వైఎస్ఆర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత డాక్టర్ శాంతినారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ రచించిన రవ్వలసడి రాయలసీమ సాహితీ విమర్శ వ్యాసాలను డాక్టర్ నాగేశ్వరాచారి సమీక్షిస్తూ రాయలసీమ కవిత్వాన్ని బేరిజు వేసుకోవడానికి ఈ పుస్తకం ఎంతో ఉపకరిస్తుందన్నారు. 1952 నుంచి నేటి దాకా రాయలసీమలో వచ్చిన కవిత్వ సారాన్ని, రూపాన్ని ఈ వ్యాసాలు ప్రతిబింబిస్తున్నాయన్నారు. రాయలసీమ సాహిత్యానికి విమర్శకు ఈ పుస్తకం కొత్త చేర్పు అన్నారు. వెంకటకృష్ణ ఈ పుస్తకానికి తన శ్రమని, సమయాన్ని ఎంతో వెచ్చించినట్టుగా ఈ పుస్తకం తెలియజేస్తుందన్నారు. మరో పుస్తకం ప్రముఖ కవి, అనువాదకులు, కథా రచయిత పి.శ్రీనివాస్‌గౌడ్ రచించిన 'శ్రీనివాసం' పుస్తకాన్ని సమీక్షిస్తూ తూముచెర్ల రాజారామ్ మాట్లాడారు. ఈ పుస్తకం వర్తమాన తెలుగు కవిత్వ భాషను, గాఢతను, ఇప్పుడు రాస్తున్న యువకవుల ఆత్మను ఆవిష్కరిస్తుందన్నారు. ఈ పుస్తకం నిండా వర్ధమాన కవుల కలలు వారి జీవితమంతా పరచుకున్న కన్నీళ్లు పరామర్శించబడ్డాయన్నారు మ.లోతైన విశ్లేషణతో ఆయా కవుల కవిత్వాన్ని శ్రీనివాస్ గౌడ్ తన ఆలోచనలతో, అనుభవంతో రచించారన్నారు. అనంతరం ఆత్మీయ అతిథి ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ కవి, అనువాదకులు జివి రత్నాకర్ మాట్లాడుతూ కవి సమ్మేళనం సాహిత్య వేదిక వర్తమాన కవిత్వానికి అసలు సిసలు వేదికగా కొత్తపల్లి సురేష్ మలిచారన్నారు. వేదిక నిర్వాహకులు, ప్రచురణకర్త కొత్తపల్లి సురేష్ మాట్లాడుతూ అసలు సిసలు సాహిత్యాన్ని భుజానమోస్తూ, ఉత్తమ సాహిత్య నిర్మాణం వైపు ఈ వేదికను నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కంబదూర్ షేక్ నబిరసూల్, మానవ హక్కుల బాషా, తరిమెల అమర్నాథ్‌రెడ్డి, గోసల నారాయణస్వామి, డాక్టర్ జన్నె ఆనంద్‌కుమార్, చేగువేరా హరి, మధురశ్రీ, మిద్దె మురళీకృష్ణ, అశ్వర్థరెడ్డి, టివి.రెడ్డి, కటకం కృష్ణవేణి, పోతుల రాధాకృష్ణ, వలస రమేష్, వంశీ, భరత్, శీర్పి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణమే లక్ష్యంగా పనిచేయాలి

డీఎస్పీకి ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాకేంద్రాన్ని ప్రశాంతంగా ఉంచడమే లక్ష్యంగా పని చేయాలని అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రసాద్ సూచించారు. నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఎమ్మెల్యేను డీఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ పరిధిలోని పోలీస్‌స్టేషన్లు, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాకేంద్రం కాబట్టి అన్నిప్రాంతాల వారు వస్తుంటారన్నారు. వారందరూ ప్రధానంగా ప్రశాంతత కోరుకుంటారన్నారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పనిచేయాలన్నారు. కక్షలు, కార్పణ్యాలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు ఇక్కడ తావు లేదన్నారు. శాంతిభద్రతల విషయంలో మాత్రం రాజకీయాలు పార్టీలు అసలు చూడవద్దని సూచించారు.

ఎమ్మెల్యే దగ్గుపాటికి బొకే అందజేస్తున్న డీఎస్పీ వి.శ్రీనివాసరావు

అనంతపురం రూరల్ : ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన డ్వామీ పీడీ సలీంబాషా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బొకే అందజేశారు. తర్వాత డ్వామా నిర్వహించే కార్యక్రమాలపై చర్చించారు.

నేటి నుంచి 'పల్లె పండుగ'

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో నేటి నుంచి ఈనెల 21వతేదీ వరకూ పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఎ.కొండాపురం, కందికాపుల, కడవకల్లు, సూరేపల్లి, 15న అరకటివేముల, దోసలేడు, మడ్డిపల్లి, చాలువేముల, 16న కుమ్మనమల, రంగరాజుకుంట, చెర్లోపల్లి, 17న మడుగుపల్లి, ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, 18న ఎస్.గూడూరు, గాండ్లపాడు, కొండేపల్లి, తక్కలపల్లి, 19న బాలాపురం, సి.వెంగన్నపల్లి, కోమటికుంట్ల, 20న పుట్లూరు, 21న గరుగు చింతలపల్లి పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసి నాయకులు అధికారులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

బుక్కరాయసముద్రం : నేటి నుంచి మండలవ్యాప్తంగా నిర్వహించనున్న పల్లె పండుగను జయప్రదం చేయాలని ఎంపిడిఒ సొలమన్‌రాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల ప్రకారం సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకూ పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని నాయకులు, నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సదాశివ, ఎపిఒ పోలేరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల వ్యాప్తంగా సోమవారం నుంచి ఈనెల 21వతేదీ వరకూ పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గంగావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కావున ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసి, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యల్లనూరు : నేటి నుంచి ఈనెల 21వతేదీ వరకూ పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు, రైతులు, గొర్రెలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆత్మకూరు : మండల వ్యాప్తంగా నేటి నుంచి ఈనెల 21వతేదీ వరకూ పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ లక్ష్మీనరసింహా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈ కార్యక్రమాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసి నాయకులు అధికారులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

ఆర్ఎంపిల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలో ఆర్ఎంపి వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఆదివారం పట్టణంలోని హటకేశ్వర ఫంక్షన్ హాల్‌లో నియోకవర్గ స్థాయి ఆర్ఎంపిల అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి ఆర్ఎంపిల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరిపైనా కక్షసాధింపు, అధికారుల వేధింపులు ఉండవని భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంత రైతులు, కూలీలు, పేదలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రాథమిక వైద్య సేవలు అందించాలని సూచించారు. సేవాదృక్పథంతో వైద్య సేవలు అందించేవారికి తన సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. అనంతరం పలువురు ఆర్ఎంపిలకు యూనియన్ తరపున సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఆర్ఎంపిలకు యూనియన్ సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు

కాలనీ బోర్డు ఆవిష్కరణ

రాయదుర్గం : పట్టణంలోని భంభం స్వామి రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అంజనాద్రి కాలనీ బోర్డును ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళుశిల్ప ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వలిబాష, మాజీ వైస్‌ఛైర్మన్ మహబూబ్‌బాషా, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరాళు పురుషోత్తం, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ నజీర్, వైసిపి నాయకులు శివ, టిడిపి నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

శ్రీ వెంకట పద్మావతి న్యూరోచిల్డ్రన్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ద్వారక ఇండియన్ పెట్రోల్ బంకు వెనుక నూతనంగా నిర్మించిన శ్రీ వెంకట పద్మావతి న్యూరోచిల్డ్రన్స్ ఆసుపత్రిని ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జయచందర్, డాక్టర్ పి కళావతి మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మరింత మెరుగైన వైద్య సేవలను ఆధునిక వైద్య పరికరాల ద్వారా అందించేందుకు నూతనంగా అన్ని హంగులతో ఆసుపత్రిని ప్రారంభించినట్లు వివరించారు. ప్రముఖ న్యూరో సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ బిసిఎం ప్రసాద్, ప్రొఫెసర్ పివి రమేష్‌చంద్ర ముఖ్య అతిథులుగా హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు నగర ప్రముఖులు, అధికారులు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేనేజింగ్ డైరెక్టర్ కుటుంబం

ప్రత్యేక పూజలు

పుట్లూరు : మండల పరిధిలోని గోపురాసపల్లి గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రజలందరూ బోనాలు తీసుకొచ్చి పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా జ్యోతుల మహోత్సవం

పెద్దపప్పూరు : మండల కేంద్రంలో చౌడేశ్వరీదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున నుంచి దేవర గృహంలో అమ్మవారి రతిబొమ్మను తయారు చేశారు. అక్కడి నుంచి అమ్మవారి అనుగ్రహంతో 9 జ్యోతులను తలపై ఎత్తుకుని గ్రామమంతా మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ అమ్మవారి భక్తిపాటలు ఆలపిస్తూ ఊరేగారు. తలపై అమ్మవారి జ్యోతులు ఉంచుకుని వారు చేసే విన్యాసాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. జ్యోతులు అమ్మవారి గుడి దగ్గరికి రాగానే లాలిపాటతో ఉదయం ఏడు గంటలకు ఉత్సవం ముగిసింది.

ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరనిలోటు

గుంతకల్లు రూరల్ : ప్రొఫెసర్ సాయిబాబా మరణం పేదల ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. ఆయన మరణానికి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ చర్యలే కారణమని ఆరోపించారు. 90 శాతం వికలాంగుడుగా ఉన్న ప్రొఫెసర్ జిఎన్. సాయిబాబాకు కేంద్రంలో ఎన్ఐఏ సంస్థ, మహారాష్ట్రలో 2014లో అప్పటి బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఉన్నాయని అక్రమ కేసును బనాయించాయన్నారు. జైల్లో ఉన్నప్పుడు ఆరోగ్యం పూర్తిగా క్షీణించినా జైలు అధికారులు వారికి వైద్య సేవలను అందించలేదన్నారు. ఏదిఏమైనా ఆయన మరణం పీడిత ప్రజల ఉద్యమాలకు తీవ్ర లోటు అన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి రథోత్సవం

నార్పల : దసరా సందర్భంగా చక్ర వెంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా స్వామివారి రథోత్సవాన్ని ఊరేగించారు. అలాగే ఉద్దిబావి చేను వదద దుర్గమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రులు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా స్థానిక అమ్మవారిశాలలో ఏర్పాటుచేసిన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు, చౌడమ్మ తల్లిని భక్తులు పురవీధుల గుండా ఊరేగించారు. ఆయా ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సామూహిక అత్యాచార నిందితులను శిక్షించాలి

పెద్దపప్పూరు : సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని హరేరామ ఆశ్రమ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ మానవ మృగాలు అత్తా, కోడలిని బెదిరించి అత్యాచారానికి పాల్పడటం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే లోతైన విచారణ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జిల్లాస్థాయి పోటీలకు బ్రహ్మసముద్రం విద్యార్థులు

బ్రహ్మసముద్రం : బ్రహ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాలూకా స్థాయి ఎస్‌జిఎఫ్ పోటీల్లో గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల పిఇటి ఇబ్రహీం, ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఎస్‌జిఎఫ్‌లో బ్రహ్మసముద్రం జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.నరసింహా, జి.మోహన్ అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన పి.యశ్వంత్ అండర్-14 విభాగంలో యోగా పోటీల్లో గెలుపొంది జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరు త్వరలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

గుత్తిలో గుంతలు పూడ్చివేత

గుత్తి : పట్టణంలోని గాంధీ కూడలిలో గుంతకల్లు రహదారిపై పడ్డ గుంతలను టిడిపి నాయకులు ఆదివారం పూడ్చివేశారు. గుత్తి నుంచి బళ్లారి కి వెళ్లే జాతీయ రహదారిపై గుంతల పడడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడేవారు. సమస్యను నాయకులు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సోదరుడు, టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ చొరవ తీసుకుని రహదారి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. టిడిపి గుత్తి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి, నాయకులు చికెన్ శీనా, చెరుకూరి లక్ష్మణ్ చౌదరి, ఆర్.సొలమాన్‌రాజ్, జక్కలచెరువు ప్రతాప్ కలిసి టిప్పర్ల ద్వారా ఎర్రమట్టిని తరలించి స్థానిక గుంతకల్లు రోడ్డులో ఉన్న గుంతలను జెసిబి ద్వారా పూడ్చి వేసి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. రహదారి తాత్కాలిక మరమ్మతులు పట్ల ప్రజల హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి : నిరుపేద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఔత్సాహికులకు ఉచితంగా డిఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారిణి బి.రాధిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోసం ప్రముఖ సంస్థలతో ఈనెల 14న సమావేశం ఉంటుందన్నారు. ఎంపికైన ప్రతినిధులు శిక్షణ ఇస్తారన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా టెట్ పరీక్ష పాసై ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకానికి సంబంధించిన అర్హతలు కలిగి ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పుట్లూరు : జిల్లాలో ఈనెల 14 నుంచి 16వతేదీ వరకూ భారీ వర్షాల సూచన నేపథ్యంలో నియోజకవర్గవ్యాప్తంగా చెరువులు, చెక్ డ్యాం,పంట కాలువల్లో గండ్లు, లీకేజీలను సంబంధిత అధికారులు పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. నీరు పారే కాలువల్లో అడ్డుగా ఉన్న రాళ్లు, వ్యర్థాలను తొలగించాలన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తేనెటీగల దాడిలో ఏడుగురికి గాయాలు

గార్లదిన్నె : మండల పరిధిలోని పెనకచర్ల గ్రామానికి చెందిన ఏడుగురు శనివారం తేనెటీగలు దాడి చేయడంతో గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. దసరా పండుగ సందర్భంగా పెనకచర్ల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, లక్ష్మీ, మణికంఠ, తేజతోపాటు మరో ముగ్గురు డ్యాం సందర్శన కోసం పెనకచర్ల నుంచి బయలుదేరారు. అయితే మార్గమధ్యలో తేనెటీగలు దాడి చేయడంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన వారిని వెంటనే స్థానికులు 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.